క్లుప్తంగా

24 నుంచి వేసవి శిక్షణా తరగతులు

రాజాం: స్థానిక జవహర్‌లాల్ బాలభవన్‌లో ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ సుంకరి రమేష్ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. రాష్ట్ర విద్యాశాఖ సూచనలతో చిన్నారులకు నృత్యం, సంగీతం, తబలా, ఆర్ట్స్, క్రాఫ్ట్, టైలరింగ్ తదితర సృజనాత్మక రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మే 31వ తేదీ వరకు ఈ తరగతులు కొనసాగుతాయని 18 ఏళ్ల వయసు లోపు వారికి మాత్రమే ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు9912949492, 8639220158, 9553123447ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బాడంగి: ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మే 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని, 21 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు మే 11వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. రూ.3 లక్షల పైబడి రుణాలకు 40 శాతం, రూ.3 లక్షల లోపు రుణాలకు 50 శాతం, వ్యవసాయ రంగ రుణాలకు 80 శాతం రాయితీ ఉంటుందన్నారు.

మెటీరియల్ వేశారు.. నిర్మాణం మరిచారు..


రోడ్డు మధ్యలో వేసిన ఇసుక పోగు

బొబ్బిలి: పట్టణంలోని గొల్లవీధి దగ్గరున్న ముత్యాలమ్మ గుడి వద్ద రోడ్డు నిర్మాణానికి చాలారోజుల క్రితం మెటీరియల్(ఇసుక, పిక్క రాయి) వేశారు. ఇప్పటివరకు ఆ నిర్మాణం ఊసే లేదు. మెటీరియల్ తెచ్చి నిర్మాణం చేయకపోవడం పట్ల స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉంటే మార్కెట్‌కు వెళ్లే దారిలోనే ఇసుక పోగులతో అటువైపుగా రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి కౌన్సిలర్ ఎస్.రామకృష్ణ.. రూ.1.30 లక్షల మున్సిపల్ నిధులను మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణ ఆలస్య విషయమై మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిని ప్రశ్నించగా, తక్షణమే రోడ్డు నిర్మాణం ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించామని తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు


గాయాలపాలైన బాధితులకు ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

రేగిడి: మండల పరిధి ఉంగరాడ గ్రామానికి చెందిన పల్లె నారాయణరావు, పల్లె అప్పలనాయుడులు బైక్ అదుపుతప్పి గాయాలపాలయ్యారు. మంగళవారం గ్రామం నుంచి మెట్టకు ద్విచక్రవాహనంపై వారు వస్తుండగా ఉంగరాడమెట్ట సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాల పాలయ్యారు. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించగా హుటాహుటిన చేరుకున్న ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ గర్భాపు నారాయణరావులు క్షతగాత్రులకు ప్రథమచికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్సకోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం


నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంతకవిటి: నవధాన్యాల సాగుతో నేల సారవంతం కావడంతో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ బి.పద్మ తెలిపారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో నవధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి రైతు నవధాన్యాలను ఖరీఫ్ సీజన్‌లో వేసుకుని 45 రోజుల తర్వాత అదే నేలలో కలియదున్నితే నేల సారవంతవుతుందన్నారు. ఆ తర్వాత వేసుకునే పంటకు కావాల్సినన్ని పోషకాలు లభిస్తాయన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాగోలు రమేష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి సవలాపురపు రామారావు పాల్గొన్నారు.


కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న రాజాం రైతుబజార్

నాడు కళకళ.. నేడు వెలవెల!

- కళ తప్పిన రాజాం రైతుబజార్
- వ్యాపారాలు సాగక షాపుల మూత
- అడ్డుగోడ, మార్నింగ్ మార్కెట్‌లతో దుస్థితి
- ఆందోళనలో రైతులు, వ్యాపారులు


ఖాళీగా రైతుబజార్‌లోని కొన్ని షాపులు

రాజాం: నాడు కళకళలాడిన రాజాం రైతుబజార్.. నేడు వెలవెలబోతోంది. వ్యాపారాలు సాగక ఒక్కొక్కటిగా షాపులు మూతపడుతున్నాయి. దీనికితోడు అద్దె భారం కూడా ఎక్కువవుతుండడంతో వ్యాపారులు దుకాణాలను వదిలేసుకుంటున్నారు. వ్యాపారం జరగని చోట ఇంతేసి అద్దెలు ఇచ్చుకుని ఉండలేమని అంటున్నారు. రైతులు, చిరువ్యాపారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ బజారులో సరసమైన ధరలకు తాజా కూరగాయలు విక్రయిస్తున్నప్పటికీ వ్యాపారాలు పడిపోవడానికి మున్సిపల్ అధికారుల అత్యుత్సాహమే ప్రధాన కారణమన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలానే పరిస్థితి ఉంటే కూరగాయల వ్యాపారాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమ పరిస్థితి.. భవిష్యత్‌లో ఎలా ఉంటుందోనని వ్యాపారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మార్నింగ్ మార్కెట్ పేరిట లూటీ..

మున్సిపల్ అధికారులు, ఆశీలు కాంట్రాక్టర్లు రాజాం పట్టణంలో కుమ్మక్కయ్యారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆశీలు కాంట్రాక్టర్లకు అధికంగా లాభాలు తెచ్చిపెట్టేందుకు మున్సిపల్ కమిషనర్‌తో పాటు మున్సిపల్ అధికారులంతా మార్నింగ్ మార్కెట్‌ను, బొబ్బిలి సెంటర్‌లో కొత్తగా రోడ్డు వ్యాపారాలను తెరమీదికి తీసుకువచ్చారు. పాత మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మార్నింగ్ మార్కెట్ పేరుతో ప్రతిరోజూ బజారు నిర్వహిస్తున్నారు. ఈ బజారులోనే కొంతమంది వ్యాపారులు కూరగాయలు విక్రయాలు చేపడుతున్నారు. వీరంతా అక్కడ కూరగాయలు అమ్ముకునేందుకు అటు మున్సిపల్ కార్యాలయానికి, ఇటు ఆశీలు కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తున్నారు. ఈ తంతు అంతా రైతుబజార్ ముంగిటే జరుగుతుండడం విచారకరం. కొనుగోలుదారులంతా ఈ మార్కెట్‌కు వచ్చి, రైతుబజార్‌కు వెళ్లడం లేదు. ఫలితంగా రైతుబజార్‌లో వ్యాపారం గగనమైపోయింది.

అడ్డుగోడే కారణం..

గతంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఆర్టీసీ బస్టాండ్ ఉండేది. దీంతో ఆ పక్కనే ఉన్న రైతుబజార్‌కు అప్పట్లో ఎక్కువగా కొనుగోలుదారులు వచ్చి, వెళ్తుండేవారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌ను పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలోకి మార్చారు. అప్పుడు కూడా రైతుబజార్‌లో వ్యాపారాలు ఆగలేదు. ఇంతలోనే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతానికి, కొత్త ఆర్టీసీ బస్టాండ్‌కు మధ్య అడ్డుగా ఓ గోడను మున్సిపల్ అధికారులు నిర్మించారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని వాహనాలు ఇటుగా రాకుండా ఉండేందుకు ఈ అడ్డుగోడ కట్టినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, ఈ గోడ కారణంగానే రైతుబజార్‌కు ప్రజల రాకపోకలు తగ్గాయన్నది అందరి నోటా వినిపిస్తోంది. గోడ కారణంగా అక్కడ రైతుబజార్ ఉన్న విషయం మర్చిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా వ్యాపారాలు మందగించాయి. అక్కడి ఒక్కో దుకాణానికి నెలకు రూ.3 వేలు చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం వ్యాపారం అంతగా లేకపోవడంతో ఆ షాపులను వదులుకునేందుకు వ్యాపారులు ఒక్కొక్కరిగా సిద్ధమవుతున్నారు. మొత్తం 42 షాపుల్లో ప్రస్తుతం 14 షాపులను మాత్రమే వ్యాపారులు నిర్వహిస్తున్నారు. మిగిలిన షాపులన్నింటినీ ఖాళీ చేసేశారు.

ఇబ్బందులు పడుతున్నాం..

గత కొంతకాలంగా తమ వ్యాపారాలు నిలిచిపోయాయి. పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉదయం మార్కెట్ నిర్వహిస్తున్నారు. అక్కడ కొనుగోలుదారులు తమకు కావాల్సిన కూరగాయలు కొనుక్కొని వెళ్లిపోతున్నారు. ఇక్కడ వరకు(రైతుబజార్) రావడం లేదు. కొత్త ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఇక్కడకు రావాలంటే అడ్డుగా గోడ ఉండడంతో వారు వచ్చేందుకు ఆసక్తి కనబరచడం లేదు. అందుకే షాపు ఖాళీ చేసేశాం.

– బి.రమణమూర్తి, కూరగాయల వ్యాపారి, రాజాం

పట్టించుకునే నాథుడే లేడు..

గతంలో తమకు ఏ సమస్య వచ్చినా అధికారులకు గానీ పాలకులకు గానీ చెబితే పట్టించుకునేవారు. ఇప్పుడు తమ సమస్యలను పట్టించుకునే నాథుడే లేడు. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా మార్కెట్లు వచ్చేస్తున్నాయి. పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోలు, ప్రైవేటు వాహనాలు రైతుబజార్‌కు అడ్డంగా ఉంటున్నాయి. కొత్త ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుంచి రావాలన్నా అక్కడ కూడా అడ్డుగోడ ఉంది. ఇలా అయితే కొనుగోలుదారులు రైతుబజార్‌కు ఎలా వస్తారు. వ్యాపారాలు సాగక అద్దెలు చెల్లించలేకపోతున్నాం.

– ఆర్.శ్రీనివాసరావు, వ్యాపారి, రాజాం


కూరగాయల వ్యాపారాల వద్ద కొనుగోలుదారులు లేని దృశ్యం

వేధింపులు భరించలేకే దాడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి పక్కనే సీఐ నారాయణరావు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఇటీవల మహంతి ధనంజయ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు బోను అక్కునాయుడును అదుపులోకి తీసుకుని డీఎస్పీ భవ్యారెడ్డి విచారణ చేశారు. అనంతరం ఆమె.. సీఐ కె.నారాయణరావుతో కలిసి మంగళవారం మీడియాతో విచారణ వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలో 20 సెంట్ల భూ వివాదంలో ఉంది. ఆ వివాదాస్పద భూమిలో కొంత స్థలం మండల కేంద్రానికి చెందిన అక్కునాయుడు కొనుగోలు చేసి, ఆ స్థలంలో 10 రోజుల క్రితం పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. అదే దుకాణం వెనకభాగంలో సిమెంట్ పోల్స్‌తో రేకుల షెడ్డు వేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తుండగా.. ధనంజయ అడ్డుకుని నిన్నెవరు ఇక్కడ దుకాణం పెట్టమన్నారు..? అని గొడవ పెట్టుకుని రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే భూమి విషయంలో అక్కునాయుడును ధనంజయ పదే పదే వేధిస్తుండడంతో అక్కునాయుడు మాటువేసి ధనంజయపై కత్తితో దాడికి పాల్పడినట్లు విచారణలో తెలిసిందన్నారు. ధనంజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు అక్కునాయుడుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం నిదింతుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ ఈఈ రంగారావు


తెర్లాం: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ గుణుపూరు రంగారావు సూచించారు. స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 150 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు, రూ.75 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. గ్రామాల వారీగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారుల వద్దకు వెళ్లి నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు ఎవరైతే పూర్తి చేయరో వారి నుంచి నిధులు వెనక్కి తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే కొత్తగా ప్రభుత్వం మంజూరు చేయనున్న గృహాలకు సంబంధించి మండలంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, పూర్తి వివరాలు సేకరించాలన్నారు. నిర్మాణాలకు సొంత స్థలం ఉందా, లేదా పరిశీలించాలని, గతంలో వారికి ఇళ్లు మంజూరైనది, లేనిదీ చూడాలన్నారు. అర్హుల జాబితాలను తయారు చేసి వారికి పొజిషన్ పట్టాలు అందివ్వాలన్నారు. ఆయన వెంట బొబ్బిలి హౌసింగ్ డీఈ అప్పయ్య, తెర్లాం ఏఈ వేణు తదితరులు ఉన్నారు.

చంద్రన్న బీమా ఏదీ?


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

రేగిడి: బీసీలకు ఇస్తామన్న చంద్రన్న బీమా పథకం ఏదీ అని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీసీలకు రూ.10 లక్షల చంద్రన్న బీమా వర్తింపజేస్తామన్న కూటమి సర్కారు.. అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో చనిపోయిన బీసీల్లో ఏ ఒక్కరికీ ఆ బీమా డబ్బులు రాలేదన్నారు. బీసీలకు ఇస్తానన్న శాశ్వత కుల ధ్రువీకరణపత్రాల జారీ కూడా అటకెక్కిందని విమర్శించారు. అలాగే షరతులు లేకుండా విద్యార్థులకు అందిస్తామన్న విదేశీ విద్యాదీవెన కూడా గల్లంతైందన్నారు. ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్‌లు గార రమణ, కెంబూరీ తేజోవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు



బొబ్బిలి మండలం, కేశాయివలస గిరిజన గ్రామ ఎంపీపీ పాఠశాల మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో యూరిన్ వచ్చినా లెట్రిన్ వచ్చినా విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అటవీ ప్రాంతం కావడంతో ఆరుబయటకు వెళ్లే విద్యార్థులకు ఏ పాము గానీ విషపురుగు గానీ కలిస్తే పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, తక్షణమే కొత్త మరుగుదొడ్లు నిర్మించడం గానీ ఉన్నవాటిని బాగు చేయడం గానీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– బొబ్బిలిరూరల్

షట్టర్లు బాగు చేయరూ..



రేగిడి మండలం, సంకిలి దగ్గరున్న ఓపెన్ హెడ్ చానల్ రెగ్యులేటర్ వద్ద షట్టర్లు పూర్తిగా పాడయ్యాయి. దీంతో సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు చుక్కనీరు కూడా అందడం లేదని వాపోతున్నారు. నీరు అంతగా ఉండని వేసవిలోనే వీటిని బాగుచేస్తే రానున్న ఖరీఫ్ సాగుకు కావాల్సినంత నీరు అందించవచ్చని అంటున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి, షట్టర్లు బాగు చేయాలని రైతులు, సాయన్నచానల్ సాగునీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్ధనరావులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– రేగిడి

ప్రభుత్వ కళాశాలలో చేరండి



ప్రభుత్వ కళాశాలలో చేరాలని బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులను కోరుతున్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి పర్యవేక్షణలో రెండు బృందాలుగా ఏర్పడి, గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తున్నారు. గొల్లాది, కామన్నవలస, ఎరుకులపాకలు, రామచంద్రాపురం, పూడివలస, మల్లంపేట గ్రామాల్లో మంగళవారం జరిగిన ప్రచారంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్ల వద్దకు అధ్యాపకులు వెళ్లి, ప్రభుత్వ కాలేజీల్లో కలిస్తున్న సదుపాయాలను వివరించారు. నాణ్యమైన విద్యాబోధన అందివ్వడంతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఈ చిత్రంలో కనిపిస్తోంది.. గొల్లాదిలో అధ్యాపకుల ప్రచారం.

– బాడంగి

జనాభా ఆధారంగా సచివాలయాల విభజన

బొబ్బిలిరూరల్: జనాభా ఆధారంగా సచివాలయాల విభజన, సిబ్బంది సర్దుబాటు చేపడుతున్నామని డీఎల్‌డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పారాది సచివాలయాన్ని ఎంపీడీవో రవికుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించిన ఆయన.. సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలపై ఆరాతీశారు. అనంతరం మన మిత్ర యాప్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా 200 పౌరసేవలు పొందవచ్చన్నారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వం చేపడుతున్న రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా డివిజన్ పరిధిలోని 127 సచివాలయాలను జనాభా ఆధారంగా విభజిస్తున్నామని, మొత్తం 60 సచివాలయాల ద్వారా సేవలందించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మిగిలిన సిబ్బందిని అవసరమైన చోట నియమిస్తామన్నారు.

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మనమిత్ర యాప్‌పై ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మంగళవారం అవగాహన కల్పించారు. 200కు పైగా పౌరసేవలు ఈ యాప్ ద్వారా అందివ్వడం జరుగుతుందన్నారు. అలాగే మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ

రాజాం సిటీ: అవగాహనతోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఎఫ్‌వో టీఎస్ఎస్ జనార్దనరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక బస్టాండ్ ఆవరణ, అంబేడ్కర్ జంక్షన్‌ల వద్ద అగ్నిప్రమాదాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు విన్యాసాలు చేసి చూపించారు. అగ్ని ప్రమాద ఘటనలు సంభవించేటప్పుడు ప్రజలు ఆందోళన చెందకుండా అవగాహనతో వ్యవహరించి నివారణా పద్ధతులు పాటించాలన్నారు. అగ్నిమాప కేంద్రం నంబర్లతో కూడిన కరపత్రాలను సినిమా హాళ్లు, దుకాణాలతో పాటు అంబేడ్కర్ జంక్షన్, బస్టాండ్ ఆవరణల్లోని ప్రయాణీకులకు పంపిణీ చేశారు. అనంతరం మెయిన్‌రోడ్డులో అవగాహనా ర్యాలీ చేపట్టారు.

వర్షంతో ఉపశమనం


తెర్లాంలో వర్షంలో గొడుగులు వేసుకుని వెళ్తున్న స్థానికులు


బాడంగిలోని యాదవుల కాలనీలో విద్యుత్ తీగలపై పడిన చెట్టు

తెర్లాం/బాడంగి: మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఇన్నాళ్లు తీవ్రమైన ఎండల కారణంగా ఉక్కపోతతో అలమటించిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం ఇచ్చింది. 2 గంటల పాటు కురిసిన వర్షానికి వాతావరణం చల్లగా మారింది. చాలా రోజుల తర్వాత ఇటువంటి వాతావరణాన్ని ప్రజలు అనుభూతి చెందగా, కొన్నిచోట్ల ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పంట నష్టం వాటిల్లింది. గాలుల ధాటికి మామిడికాయలు, అరటి చెట్లు నేలరాలాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాల తీగలపై చెట్టుకొమ్మలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సంక్షిప్తంగా...

చలివేంద్రం ఏర్పాటు

రేగిడి: మండల కేంద్రంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ పేరిట ఆయన కుమారుడు సర్పంచ్ కిమిడి రవిశంకర్ చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు వేసవి కాలం అంతా ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రిని తరలిస్తాం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రిని ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం సందర్శించారు. రికార్డుల పరిశీలనానంతరం రోగులకు ఏ విధంగా సేవలందిస్తున్నారన్న విషయంపై వైద్య సిబ్బందిని ఆరాతీశారు. రోగులకు వీలుగా ఆస్పత్రి భవనం, పరిసరాలు లేకపోవడంతో త్వరలోనే మరోచోటకు ఆస్పత్రిని తరలిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

వితరణ

రాజాం సిటీ: మండలంలోని కంచరాం ఎస్సీ కాలనీ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ వితరణ చేశారు. వాటిని విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాల తనిఖీ

బొబ్బిలిరూరల్: మండలంలోని కేశాయివలస ఎంపీపీ పాఠశాలను ఎంఈవో చల్లా లక్ష్మణరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజనం వంటకాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టాలని, రుచి శుచికరంగా వంటకాలు ఉండాలని తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తెర్లాం/బొబ్బిలి/బొబ్బిలిరూరల్: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలని, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గర్భిణులు, బాలింతలకు 1000 రోజుల కేర్‌పై అవగాహన కల్పించారు.

రూ.3 లక్షలతో సీసీ కాలువ నిర్మాణం

రాజాం: స్థానిక ఆదర్శనగర్‌లో రూ.3 లక్షల వ్యయంతో సీసీ కాలువ నిర్మించారు. ఈ నిర్మాణ పనులను ఏఈ వెంకట్ మంగళవారం పరిశీలించారు. అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సన్మానం


ఎంఈవో దుర్గారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వంగర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఎంఈవో యాగాటి దుర్గారావుకు మంగళవారం సన్మానం చేశారు. హెచ్ఎం ముద్దాడ రమణమ్మ ఆధ్వర్యంలో వంగర క్లస్టర్ పాఠశాలల ఉపాధ్యాయులంతా ఆయనను దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం మండలంలో విద్యాభివృద్ధికి ఆయన పాటుపడిన తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఖండాపు జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్‌లో ఐదేళ్ల వయసు నిండిన పిల్లలను స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో జె.త్రినాధరావు సిబ్బందిని కోరారు. మండలంలోని కుమ్మరిపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించి, ప్రీస్కూల్ పిల్లల హాజరు, పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే క్రిమినల్ కేసు

వంగర: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని మగ్గూరు జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మంగళవారం నిర్వహించారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారు మద్యం తాగినదీ లేనిదీ బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. అనంతరం మద్యం సేవించి వాహనాలు నడపడం జరుగుతున్న దుర్ఘటనలను వివరించి, చైతన్యం చేశారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానా

బొబ్బిలి: పట్టణంలోని ఖాళీ స్థలాల్లో ఎవరైనా చెత్తా చెదారం వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. స్థానిక ఆరి గంగయ్య షాపింగ్ కాంప్లెక్స్, శ్వేతాచలపతి స్కూల్, దిబ్బవీధి రోడ్డు, బొడ్డు వారి కల్యాణ మండపం ప్రాంతాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. కాలువల్లోని పూడికలు తొలగించాలని, అన్ని కాలువల ద్వారా మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఆమె వెంట పర్యావరణ ఇంజినీరు సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


నగదు అందిస్తున్న లక్ష్మీపురం గ్రామస్తులు

రాజాం సిటీ: మండలంలోని లక్ష్మీపురం గ్రామస్తులు శివాలయం నిర్మాణానికి మంగళవారం విరాళం అందజేశారు. సంతకవిటి మండలంలోని గోవిందపురం గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న మందిరానికి తమవంతు సహాయంగా రూ.38 వేలు అందించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.